క్లుప్తంగా

విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి

జీడిమెట్ల: జీడిమెట్ల డిపో నుంచి ఎస్ఆర్ నాయక్‌నగర్ వెళ్లే రోడ్డులో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. జీడిమెట్ల డిపో నుంచి ఎస్ఆర్ నాయక్‌నగర్ రోడ్డుకు మధ్యలో ఉన్న జీడిమెట్ల పారిశ్రామిక రోడ్లలో విద్యుత్ దీపాలు లేవు. దీంతో రాత్రివేళ డిపో నుంచి నడుచుకుంటూ వచ్చే మహిళలు యువతులు భయపడుతున్నారు. గత 15రోజుల క్రితం చీకటిగా ఉండటంతో నడుచుకుంటూ డ్యూటీ నుంచి వస్తున్న ఇద్దరు యువతుల చేతిలోంచి గుర్తు తెలియని వ్యక్తులు సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయారు. ఇప్పటికైనా ఐలా మున్సిపల్ అధికారులు పట్టించుకుని ఇండస్ట్రియల్ రోడ్డులో విద్యుత్‌దీపాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు, రేపు నీటి సరఫరా బంద్

రంగారెడ్డినగర్: గోదావరి జలాల పంపిణీ వ్యవస్థ నిర్వహణ నేపథ్యంలో రెండు రోజుల పాటు సరఫరాలో నిలిపేస్తున్నట్లు కుత్బుల్లాపూర్ జలమండలి జనరల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు. బుధవారం, గురువారాల్లో కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లతో పాటు, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలు, నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో నీటి సరఫరా పూర్తి నిలిచిపోతుందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గ్రహించి సహకరించాలని జీఎం కోరారు.

నేడు కేన్సర్ ఉచిత స్క్రీనింగ్ టెస్ట్

నిజాంపేట్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం బాచుపల్లిలోని మమత మెడికల్ హాస్పటల్‌లో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ చేయనున్నామని ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అపర్ణరాజ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. అంతే కాకుండా ఉచిత కేన్సర్ శిబిరంలో పాల్గొనే మహిళలకు పాప్‌స్మియర్, మామోగ్రఫీ పరీక్షలను అనుభవజ్ఞులైన వైద్యులతో నిర్వహించనున్నారు. మహిళల స్వీయ సంరక్షణ, ఆరోగ్యం కోసం మమత హాస్పటల్ యాజమాన్యం తమ వంతు సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే ఉచిత కేన్సర్ పరీక్షలను నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలతో పాటు చుట్టు పక్కల కాలనీల, బస్తీల వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డబుల్ ఇళ్లు ఎప్పుడిస్తారు?

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 13,404 డబల్ ఇళ్ల నిర్మాణాలు
- లబ్ధిదారులకు అందని ఇళ్లు

కుత్బుల్లాపూర్: నాలుగేళ్లగా డబల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం ప్రజలు ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇంటింటికి తిరిగి దరఖాస్తులను పరిశీలించిన సిబ్బంది వాటి నివేదికను ఉన్నతాధికారులకు పంపించినా ఇప్పటి వరకు కార్యరూపం దాల్చడం లేదు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రూ .1150.80 కోట్ల అంచనా నిధులతో 13,404 డబల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఈ నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి. లబ్ధిదారులకు అందజేయడమే తరువాయి అన్నట్లుగా ఇటీవల దరఖాస్తుల పరిశీలన పూర్తి చేశారు. నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు వాటి ఊసే లేకపోవడం ప్రజల్లో అసహనం వ్యక్తం అవుతోంది.

58 వేలకు పైగానే దరఖాస్తులు...

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఉండే పేద ప్రజలు డబల్ బెడ్‌రూమ్ ఇళ్లపై గంపెడాశతో ఉన్నారు. తమకు ఇల్లు కేటాయించాలని ఇప్పటికే ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూ కాళ్లావేళ్లా పడుతున్నారు. అయితే పూర్తి క్లారిటీ ఇవ్వ లేకుండా ఉన్న ఈ డబల్ బెడ్ రూమ్ ఇళ్లపై అధికార బీఆర్ఎస్ పార్టీ నాయకులు పూర్తిస్థాయిలో తమ హస్తగతం చేసుకొని వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందే విధంగా పావులు కదుపుతున్నట్లు తెలిసింది. నియోజకవర్గం మొత్తం మీద 58,575 దరఖాస్తులు రాగా గ్రేటర్ పరిధిలోని కుత్బుల్లాపూర్ (30,800), గాజులరామారం (27775) జంట సర్కిల్లో సుమారు 111 గ్రూపులను ఏర్పాటు చేసి ఏరియాల వారీగా ఇంటింటికి తిరిగి ఒక్కో గ్రూపు 500 దరఖాస్తులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు.

ఇంకెన్ని రోజులీ నిరీక్షణ!

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దుండిగల్ మున్సిపాలిటీ, నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి, గాజులరామారం సర్కిల్ పరిధిలోని దేవేందర్‌నగర్ ప్రాంతాల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు.. అక్కడ కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసే విధంగా ఏమాత్రం పనులు జరగడం లేదు. ప్రస్తుతం ఎన్నికల సమయం ఉండగా ఈ క్రమంలో కొంత మందికి డబల్ బెడ్ రూములు ఇచ్చి తద్వారా లబ్ధి పొందుదామని భావిస్తే... ఇళ్లు రాని వాళ్ల పరిస్థితి ఏమిటన్న విషయంపై అధికార పార్టీ నాయకులు మల్లగుల్లలు పడుతున్నారు. ఈ డబల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ 'ముందు నుయ్యి.. వెనుక గొయ్యి'అన్న చందంగా మారింది.. గత నాలుగు ఐదు ఏళ్ల నుంచి ఈ నిర్మాణ పనులు జరుగుతుండగా ఇదిగో ఇస్తున్నాం.. అదిగో ఇస్తున్నాం.. అంటూ కాలయాపన చేయడమే తప్ప ఇంతవరకు డబల్ బెడ్ రూములు ఇచ్చిన దాఖలాలు లేవు. ఇంకెన్నాళ్లు ఈ నిరీక్షణ అంటూ దరఖాసుదారులు గగ్గోలు పెడుతున్నారు.


దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో పూర్తయిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు


దేవేందర్‌నగర్‌లో పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్‌బెడ్‌రూమ్ గృహ సముదాయం


గతేడాది సాయిబాబానగర్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రధానరోడ్లు కంపుకొడుతున్నాయి..

రంగారెడ్డినగర్: స్వచ్ఛ్ సర్వేక్షణ్‌పై ఓ వైపు అధికారులు ఊకదంపుడు ప్రసంగాలు చేస్తున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ప్రతిరోజు చెత్తను తరలించాల్సి ఉండగా పారిశుద్ధ్య సిబ్బంది ఆ దిశగా పనులు చేపట్టడం లేదు. దీంతో ప్రధాన రోడ్లు చెత్తతో కంపుకొడుతున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఏపీహెచ్‌బీ ఖాళీ ప్రదేశం, రంగారెడ్డినగర్ రోడ్డు, గాంధీనగర్ ప్రధాన రోడ్డు పక్కన, పంచశీల కాలనీని ఆనుకుని ఉన్న ఐడీపీఎల్ స్థలం, హెచ్‌ఎంటీ ప్రాంతం ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ప్రాంతాల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్‌కు చర్యలు చేపడుతున్నామని అధికారులు చెబుతున్నా పర్యవేక్షణ కొరడిందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. రోజుల తరబడి చెత్తను తరలించకపోవడంతో తీవ్ర దుర్గంధంతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నామయని తెలిపారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించే ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


రంగారెడ్డినగర్ రోడ్డులో పేరుకుపోయిన వ్యర్థాలు

రోడ్లపైనే మట్టి, సిమెంట్ వ్యర్థాలు

రంగారెడ్డినగర్: రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా వెలువడుతున్న మట్టి, సిమెంట్ వ్యర్థాలను తరలించడంలో సంబంధిత కాంట్రాక్టర్లు మీనమేషాలు లెక్కిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డినగర్ పరిధిలోని గాంధీనగర్‌లో ఇటీవల పలు వీధుల్లో సీసీ రోడ్లు వేశారు. ఈ క్రమంలో వెలువడిన మట్టి, సిమెంట్ వ్యర్థాలను సదరు కాంట్రాక్టర్ తరలించకుండా రోడ్ల మీదనే వేసి చేతులు దులుపుకోవడంతో వాహనదారుల రాకపోకలకు ఆటంకంగా మారుతోంది. గాంధీనగర్‌లోని 2వ గల్లీలో రోడ్డు పనులు పూర్తికాగా ప్రధాన రోడ్డుకు ఆనుకుని మట్టి కుప్పలు వేశారు. దీంతో వేగంగా వచ్చే వాహనదారులు వీటిని గమనించక ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు వేసి 20 రోజులు కావస్తున్నా మట్టి కుప్పలు తరలించడంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


గాంధీనగర్ ప్రధాన రోడ్డులో రాకపోకలకు ఆటంకంగా ఉన్న మట్టి కుప్పలు

అగ్నిప్రమాదం

జీడిమెట్ల: హెచ్‌ఎంటీలోని సబ్‌స్టేషన్ సమీపంలో స్వల్ప అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సబ్‌స్టేషన్ పక్కన కొంతమంది వేరే ప్రాంతంలో నరికివేసిన చెట్ల కొమ్మలను పడేశారు. చెట్టు కొమ్మలు ఎండిపోవడంతో మంటలు అంటుకోవడంతో అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న జీడిమెట్ల అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని 15నిమిషాల్లో మంటలను ఆర్పివేశారు.



ఫొటో ప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో మంగళవారం మైలవరపు రమణి ఇన్ విజబుల్ రూట్స్ పేరిట ఏర్పాటు చేసిన ప్రదర్శనను జేఎన్ఎఎఫ్‌యూ ప్రొఫెసర్ ఆనంద్ గడప ప్రారంభించారు. ఈ ప్రదర్శన 9వతేదీ వరకు ఉదయం 10 నుంచి 7గంటల వరకు ఉంటుందన్నారు.

సూపర్ పవర్‌గా ఎదగడానికి సమష్టి కృషి అవసరం



నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్

రాయదుర్గం: పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించేందుకు, అభివృద్ధి చేసేందుకు విద్యాసంస్థలు తోడ్పడాలని నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్ సూచించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ×ఎస్పైర్× సంస్థ 5వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా మంగళవారం నిర్వహించారు. ఫౌండేషన్ లెక్చర్ కార్యక్రమంలో భాగంగా ×ఇండియాస్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎకోసిస్టమ్× అనే అంశంపై ఆయన మాట్లాడుతూ భారతదేశం సూపర్ పవర్‌గా ఎదగడానికి ఉత్పత్తి ఆధారిత లోతైన సాంకేతిక ఆవిష్కరణల అభివృద్ధి, స్టార్టప్‌లు, పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు సమష్టి కృషి అవసరమన్నారు. హెచ్‌సీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ హెచ్‌సీయూ క్యాంపస్‌లో, చుట్టుపక్కల ఉన్న వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థను పెంపొందించడంలో ఎస్పైర్ ప్రయత్నాలను ప్రశంసించారు. అనంతరం ఎస్పైర్ ఇంక్యుబేటర్‌లో ఏర్పాటు చేసిన స్టార్టప్‌లను వారు పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ పరిశోధనా సంస్థల అధిపతులు, ఫార్మా అండ్ బయోటెక్ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, హెచ్‌సీయూ స్టార్టప్ కమ్యూనిటీ సభ్యులు, వివిధ విద్యాసంస్థల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా డీప్ రూట్స్ హైస్కూల్ వార్షికోత్సవం


నృత్య ప్రదర్శనలు చేస్తున్న డీప్ రూట్స్ హైస్కూల్ విద్యార్థులు


జ్యోతిని వెలిగిస్తున్న ప్రిన్సిపాల్ ఛాయాదేవి, డైరెక్టర్ శేషు

కుత్బుల్లాపూర్: విమానపురి కాలనీలోని 'డీప్ రూట్స్' హైస్కూల్ 13వ వార్షికోత్సవ సంబరాలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలు చేసిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రస్తుతం ట్రెండింగ్ లో ఉన్న సినిమా పాటలకు తమదైన స్టైల్ లో స్టెప్పులు వేసి అదరగొట్టారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత సింహారెడ్డి,మండల విద్యాధికారి ఆంజనేయులు, ట్రిస్మా అధ్యక్ష కార్యదర్శులు వనజ, చారి, కోశాధికారి నర్సిరెడ్డి పాల్గొన్న, ప్రిన్సిపాల్ ఛాయాదేవి, డైరెక్టర్ శేషు, పెద్ద ఎత్తున పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీలో రుణ లక్ష్యం దాటిన మేడ్చల్

సాక్షి,మేడ్చల్ జిల్లా: స్వయం సహాయక బృందాల్లోని మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఈ రుణాలను వినియోగించుకుని మహిళలు ఆర్థికాభివృద్ధి దిశగా అడుగేస్తున్నారు. జిల్లాలోని అన్నీ మండలాల్లో నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించడం ద్వారా ముందంజలో ఉంది. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ స్వయం సహాయక సంఘాలకు 2022–23 ఆర్థిక సంవత్సరం గడువు ముందే వంద శాతానికి మించి బ్యాంకు లింకేజీ రుణాలను పంపిణీ చేయడంతో తెలంగాణలో నాలుగోవ స్థానంలో నిలిచింది.

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో సుమారు 118 గ్రామైక్య సంఘాలు, 3,361 వరకు స్వయం సహాయక బృందాలు ఉన్నాయి. అందులో ప్రస్తుత 2022–23 ఆర్థిక సంవత్సరంలో 2,785 సంఘాలకు రూ.152.92 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఆర్థిక సంవత్సరం ఆరంభం నుంచే గ్రామీణాభివృద్ధి శాఖ జిల్లా అధికారులతో పాటు స్థానిక ఐకేపీ అధికారులు కృషి చేస్తున్నారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటిస్తూ రుణాలకు అర్హత కల్గిన సంఘాలను గుర్తించి బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు ఇప్పిస్తున్నారు.

బ్యాంకు లింకేజీ రుణ పంపిణీలో ముందంజ..

రుణ వితరణలో జిల్లాలోని ఐదు మండలాలు లక్ష్యానికి మించి రుణాలు అందించి ముందంజలో ఉన్నాయి. ఘట్కేసర్ మండలంలో 706 సంఘాలకు రూ.43.52కోట్లు, కీసర మండలంలో 535 సంఘాలకు రూ.21.19 కోట్లు, మేడ్చల్ మండలంలో 571 సంఘాలకు రూ.30.18 కోట్లు, ఎంసీపల్లిలో 440 సంఘాలకు రూ.24.66 కోట్లు, శామీర్‌పేటలో 553 సంఘాలకు రూ.33.36 కోట్లు పంపిణీ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం ఈ నెల 31తో ముగుస్తున్నందున లక్ష్యాన్ని అధిగమించి 110 శాతానికి బ్యాంకు లింకేజీ రుణ పంపిణీ చేరేలా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ చర్యలు తీసుకుంటోంది.

లక్ష్యాన్ని అధిగమించేలా...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ 2022–23 ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా స్త్రీనిధి రుణాల పంపిణీలో లక్ష్యాన్ని అధిగమించేలా చర్యలు తీసుకుంటోంది. జిల్లాలోని ఐదు మండలాల పరిధిలోని 2,304 స్వయం సహాయక సంఘాలకు రూ.17.27 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యంగా నిర్ణయించినప్పటికీ ఇప్పటి వరకు రూ.12.24 కోట్ల (70.92 శాతం) రుణాలను మాత్రమే అందజేశారు. మిగతా స్త్రీనిధి రుణాలను ఈ నెలాఖరు కల్లా స్వయం సహాయక సంఘాలకు పంపిణీ చేయడం ద్వారా లక్ష్యాన్ని అధిగమించేలా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ చర్యలు తీసుకుంటోంది.

నాలాలో చెత్తాచెదారాన్ని తొలగించాలి

జీడిమెట్ల: నాలాలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. సుభాష్‌నగర్ డివిజన్ వెంకటాద్రినగర్‌లో ఉన్న నాలాలో ప్లాస్టిక్ వ్యర్థాలు నిండిపోయాయి. నాలాలో చెత్త పేరుకుపోవడంతో నాలాలో నుంచి మురుగు సాఫీగా వెళ్లకపోవడంతో దుర్గంధం వెలువడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాలా వలన దోమలు విపరీతంగా వృద్ధి చెంది స్థానికంగా ఉన్న కాలనీవాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సర్కిల్ మున్సిపల్ అధికారులు పట్టించుకుని నాలాలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని కోరుతున్నారు.


వెంకటాద్రినగర్ కాలనీలోని నాలాలో పేరుకుపోయిన చెత్తాచెదారం

వ్యక్తి అదృశ్యం


చంద్రశేఖర్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ వాజ్‌పేయినగర్‌కు చెందిన చంద్రశేఖర్(28), సంధ్యలు భార్యాభర్తలు. ప్రైవేట్ ఉద్యోగి అయిన చంద్రశేఖర్ ఈనెల 6వ తేదీన ఉదయం 7.30 గంటలకు శివాలయానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. ఎంత సేపటికి తిరిగి రాకపోయేసరికి భార్య సంధ్య అతని మొబైల్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టు పక్కల, స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితం లేకుండా పోయింది. అయితే చంద్రశేఖర్ బైక్‌లో ఓ లెటర్ లభించింది. అందులో బజాజ్ ఫైనాన్స్‌కు డబ్బులు కట్టలేకపోతున్నానని అన్నారు. పరువు పోతుందని ఇంటి నుంచి వెళ్లిపోతున్నానంటూ రాసి ఉంది. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సుభాష్‌నగర్: తాను నడుపుతున్న వాహనంతో ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టిన సంఘటనలో ఓ వ్యక్తి అక్కడికి అక్కడే మృతిచెందిన సంఘటన దుండిగల్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమణారెడ్డి వివరాల ప్రకారం.. పఠాన్‌చెరుకు చెందిన ఈ.సంతోష్(30) మేడ్చల్ వైపు నుంచి తన మారుతి ఓమ్నీ (టీఎస్24బి 3432) కారులో పఠాన్‌చెరు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సంతోష్ వాహనం నడుపుతూ మల్లంపేట వద్ద ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టి తీవ్రగాయాలతో అక్కడికి అక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న దుండిగల్ పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి పంచనామా నిర్వహించారు. అనంతరం కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. సంతోష్ తాను నడుపుతున్న వాహనాన్ని ఆగి ఉన్న మరో వాహనాన్ని ఢీకొట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా ఆధారాల కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు.


కారులో చిక్కుకుని మృతిచెంది ఉన్న సంతోష్

ఎంఎల్ఆర్ఐటీ కళాశాలకు హరితహారం అవార్డు

సుభాష్‌నగర్: ఎంఎల్ఆర్ఐటీ కళాశాలకు హరితహారం అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని కళాశాల చైర్మన్ మర్రిలక్ష్మణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ఐటీసీ కాకతీయలో సీఐఐ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) అవార్డుల ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. కొన్ని సంవత్సరాలుగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో ఎంఎల్ఆర్ఐటీ విద్యార్థులు, అధ్యాపకులు, వలంటీర్లు, కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం కలిసి వేల సంఖ్యలో మొక్కలను నాటారు. అదే విధంగా కళాశాల యాజమాన్యం దత్తత తీసుకున్న గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలను కళాశాల తరఫున నాటారు.

కేటీఆర్ మెప్పుపొందిన కళాశాల..

హరితహారం కార్యక్రమంలో పాల్గొనడానికి దుండిగల్‌కు కేటీఆర్ వచ్చిన సందర్భంలో కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కలను నాటారు. ఇది గమనించిన కేటీఆర్ అప్పట్లో కళాశాల యాజమాన్యాన్ని అధ్యాపక బృందాన్ని, విద్యార్థులను అభినందించారు. హరితహారం కార్యక్రమంలో ఎంఎల్ఆర్ఐటీ కళాశాల విద్యార్థుల కృషిని గమనించిన సీఐఐ కళాశాలకు హరితహారం అవార్డును అందజేశారు. ఈ అవార్డును కళాశాల చైర్మన్ మర్రిలక్ష్మణ్‌రెడ్డి అందుకున్నారు. ఎంఎల్ఆర్ఐటీ కళాశాలకు అవార్డు రావడం పట్ల కళాశాల కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డా.కె.శ్రీనివాసరావు, అధ్యాపకులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.


హరితహారం అవార్డును అందుకుంటున్న ఎంఎల్ఆర్ఐటీ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి

రంగ్ దే..

మిన్నంటిన హోలీ సంబురాలు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మంగళవారం హోలీ సంబరాలు మిన్నంటాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ హోలీ ఉత్సవాల్లో పాల్గొని సందడి చేశారు. ఉదయం నుంచే తమ స్నేహితుల ఇళ్లకు వెళ్లి పలువురు రంగులు జల్లి హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు, పెద్దలు పూర్తిగా రంగుల్లో మునిగిపోయారు. ఏ వీధి చూసినా రంగులతో నిండిపోయింది.పలువురు ప్రజాప్రతినిధులను ఆయా పార్టీల నాయకులు, స్థానిక సంక్షేమ సంఘాల ప్రతినిధులు కలిసి హోలీ శుభాకాంక్షలు తెలిపి రంగులు పూశారు. – కుత్బుల్లాపూర్


ఎమ్మెల్యే వివేకానంద్‌కు రంగులు పూస్తున్న చిన్నారి


నిజాంపేట్‌లో హోలీ సంబరాల్లో కొలన్ శ్రీనివాస్‌రెడ్డి


చిత్తారమ్మదేవినగర్‌లో..


హోలీ వేడుకల్లో వైష్ణవి ఎన్‌క్లేవ్ కాలనీవాసులు


వెంకటాద్రినగర్‌లో కాముని దహనం చేస్తూ..


దూలపల్లిలో..


కాముని దహనం చేస్తున్న దృశ్యం


రాధాకృష్ణ ఆలయంలో హోలీ సంబరాలు